క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్–4 కార్యాలయంలో ఈ నెల 7న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.వి.ఎస్.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సెబ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జి, సెబ్ అధికారుల ఆదేశాల మేరకు వారి సమక్షంలో వేలం వేస్తామన్నారు. వివరాలకు 94409 02382 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చుండూరు అమరవీరులకు ఘన నివాళి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నేత లక్ష్మి

తాటిచెట్లపాలెం: ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ, ఎంఎస్ ఎస్ఎస్, అరుణోదయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో చుండూరు దళిత అమరవీరుల 32వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దళితులు, ఆదివాసీలకు రాజ్యాంగ పరంగా, సబ్‌ప్లాన్ పరంగా కేటాయించిన నిధులను వారికే ఖర్చుపెట్టాలని సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని, కారంచేడు, చుండూరు, మణిపూర్ లాంటి అమానవీయ ఆధిపత్య కుల అహంకార దాడులు, లైంగిక అత్యాచారాలు, హత్యలు లేనటువంటి నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఉద్యమిద్దామని తీర్మానించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, దళిత విముక్తి కన్వీనర్ ఎస్.వి.రమణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, విద్యా పరిరక్షణ కమిటీ నాయకుడు డి.కిషోర్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.శరత్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సర్వే

సీతమ్మధార: స్వచ్ఛ సర్వేక్షణ్–2023 కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది జోరుగా సర్వే చేపడుతున్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం సచివాలయం ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేశారు. జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలపై నగర ప్రజల వద్ద నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. రేసపువానిపాలెం, బుల్లయ్య కళాశాల తదితర ప్రాంతాల్లో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ జయశ్రీ, ఉష, భార్గవి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని బాలుడికి గాయాలు

మద్రిపాలెం: ఆటో ఢీకొని ఓ చిన్నారికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలోని హనుమాన్ ఆలయం వద్ద తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ఆరేళ్ల మళ్ల నవదీప్ శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటి ముందు సైకిల్‌తో ఆడుకుంటున్నాడు.. ఆ సమయంలో అటుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఆ బాలుడికి గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తండ్రి మళ్ల అనీల్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆదివారం సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'మహాశక్తి' కార్యక్రమం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో సోమవారం మహాశక్తి–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ వార్డు అధ్యక్షురాలు బి.పద్మలత తెలిపారు. వార్డులోని కార్యాలయంలో ఆదివారం వార్డు కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కొట్టాన దేముడు, బాబు, దుంగి శ్రీనివాసులు, శంకరరావు, రమణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహం.. మధురానుబంధం



స్నేహానికి గుర్తుగా గ్రూప్ ఫొటో తీసుకుంటున్న మాధవధార పాఠశాల పూర్వ విద్యార్థులు



30 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్న సీతమ్మధార వసంతబాల హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సందడిగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

మురళీనగర్: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా స్నేహితులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే చెప్పుకుని రోజంతా ఆనందంగా గడిపారు. ఎవరికీ చెప్పుకోలేని ఊసులు ఒక్క స్నేహితుడికే చెప్పుకుంటాం. ఆపదలో.. ఆనందంలో ఒకే విధంగా తన అభిమానాన్ని చూపించేది స్నేహితుడు మాత్రమే. ఆ స్నేహ బంధం చిరకాలం నిలిచి ఉంటుందని మాధవధార పాఠశాల పూర్వ విద్యార్థులు నిరూపించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా వీరు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో కలుసుకుని అక్కడి నుంచి వెళ్లి పుణ్యగిరి సందర్శించారు. వీరు 1986 నుంచి 1991 వరకు మాధవధార ప్రాథమికోన్నత పాఠశాలలో చదివారు. నేటి వరకు వీరు తమ స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారు. స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతమంటూ తమ చిన్ననాటి ముచ్చట్లతో ఆనందంగా గడిపారు.

స్నేహితుల ఆత్మీయ కలయిక

సీతమ్మధార: సీతమ్మధార టీపీటీ కాలనీలోని వసంతబాల హైస్కూల్‌లో 1993–94 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం డైమండ్ పార్కు దరి ఒక హోటల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. రీయూనియన్ పేరిట కలుసుకున్న పూర్వ విద్యార్థులు కేక్ కట్ చేసి సందడి చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న గాదె శ్రీనివాసులు నాయుడు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో ఆదివారం పీఆర్‌టీయూ విశాఖ జిల్లా కొత్త కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నూతన అధ్యక్షుడిగా మడ్డు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కోమ్మనాపల్లి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మురళీ మోహన్‌రావు, పరిశీలకుడిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బైరి అప్పారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పీఆర్‌టీయూ కార్యవర్గ సమావేశం..

ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు వేధింపులు ఆపకపోతే ఉద్యమిస్తామని పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం హెచ్చరించింది. ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పీఆర్‌టీయూ కన్వీనర్ డి.జి.నాథ్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ నోట్‌బుక్‌ల తనిఖీ పేరిట ఉపాధ్యాయులపై విద్యా శాఖ ఉన్నతాధికారుల తీరు మారకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏకీకృత సర్వీస్ రూల్స్ ఫైల్‌ను క్లియర్ చేయాలని, టీచర్లపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'పై అవగాహన



లేన్సమ్ గ్రీన్స్‌లో నివాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ్–2023పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లేన్సమ్ గ్రీన్స్, మౌర్య సదన్ అపార్ట్‌మెంట్లలో నివాసులకు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరం నాలుగో స్థానంలో ఉండేదని, ప్రస్తుతం మొదటి స్థానానికి తీసుకురావడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సోషల్ మీడియా కన్వీనర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా జోన్ ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణ లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించా రు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చి నా కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్ల ను సీఐ హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పు డూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా జీవించండి

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల దినచర్య, సత్ప్రవర్తన కలిగి ఉంటున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా మంచిగా జీవించాలని సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద స్టేషన్ సిబ్బంది అప్పగించారు.

ఫేక్ సిమ్‌కార్డులు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

మద్రిపాలెం: ఓ వ్యక్తి ఫేక్ సిమ్‌కార్డులు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు విచారణ జరిపారు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తనిఖీలు నిర్వహించగా ఊర్వశి కూడలి దరి పాన్‌షాప్ కమ్ జిరాక్స్ షాపులో నకిలీ సిమ్‌కార్డులు విక్రయిస్తున్నారని తేలింది. దీంతో విచారణ జరపగా 2019 సమయంలో ఒకే ఆధార్ కార్డు ప్రూఫ్‌తో నాలుగు లేక ఐదు సిమ్‌కార్డులు విక్రయించినట్టు వెల్లడైంది. గతంలో ప్రూఫ్ కోసం ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోలు ఇస్తే సిమ్‌కార్డ్ ఇచ్చేవారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసు లు పత్రాలన్నీ వెరిఫై చేయగా గణేష్ అనే వ్యక్తి సుమారు 60 వరకు ఫేక్ సిమ్‌కార్డులు విక్రయించినట్టు తెలిసింది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఆదివారం ఎస్ఐ షేక్ సమీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి తరానికి బాల సాహిత్యం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సుహాసిని ఆనంద్, ఎస్వీ రమణమ్మ

సీతంపేట: బాలబాట పిల్లల మాస పత్రిక 16వ వార్షికోత్సవం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. బాలబాట సంపాదకురాలు స్వరాజ్యం వెంకట రమణమ్మ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధి, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ భావితరాల్లో ఉన్నతంగా నిలవాలన్న ఉద్దేశంతో 15 ఏళ్లుగా పిల్లల కోసం మాస పత్రిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి దశలోనే తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి పెంపొందించేలా కృషి చేస్తున్నామన్నారు. ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ మాట్లాడుతూ మొబైల్ చాటింగ్, గేమ్స్, రీల్స్ చూడటానికి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తూ పుస్తక పఠనాన్ని పక్కన పెట్టేస్తున్న నేటితరం పిల్లలకు ఇటువంటి మాసపత్రికలు స్ఫూర్తిదాయకమన్నారు. బాల సాహిత్యాన్ని నేటి తరానికి అందిస్తున్న రమణమ్మ సేవలు అభినందనీయమన్నారు. క్లోపల్లి స్వర్ణలత రచించిన కథల సంపుటి 'గెలుపెవరిది', వరలక్ష్మి రచించిన 'వరాల కథలు', వార్షికోత్సవ సంచికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అయ్యగారి సీతారత్నం, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

టోఫెల్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన 8వ తరగతి విద్యార్థులు



15/15 మార్కులు సాధించిన 6వ తరగతి విద్యార్థులు

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బోధనకు ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు చేసిన తర్వాత టోఫెల్ పరీక్ష నిర్వహించారు. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో 13 నుంచి 29 వరకు ఎనిమిది ప్రాక్టీస్ టెస్టులు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నేర్పించారు. దానిపై 15 మార్కులకు జరిగిన టోఫెల్ పరీక్షలో మధురానగర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఐఎఫ్‌పీ ప్యానెల్‌లో ప్లేచేసిన రీడింగ్, లిజనింగ్ ప్రశ్నలపై 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు పరీక్ష రాశారు. ఇంగ్లిష్ పరీక్షలో 8వ తరగతి విద్యార్థులు 15కు 13 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. సుభాని, దేవి, శరణ్య మహాలక్ష్మి, అక్తర్, జ్యోత్స్న, వెంకటలక్ష్మి, చరణ్‌కుమార్ 13 మార్కులు సాధించారు. 6వ తరగతి విద్యార్థులు పదవన్ సాయి, హస్వీక 15కు 15 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. వీరిని పాఠశాల హెచ్ఎం శాంతికుమారి, ఇంగ్లిష్ టీచర్ పి.ఎస్.ఎస్.రెడ్డి అభినందించారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు గానూ ఉదయం, సాయంత్రం వేళ స్టాళ్లకు సంబంధించి డ్రా తీసి రైతులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

జ్యోతిష్య రత్న అప్పారావు సిద్ధాంతి



బయ్యపు అప్పారావు సిద్ధాంతి దంపతులను సత్కరిస్తున్న గుర్రాల శ్రీనివాస్

సీతంపేట: జ్యోతిష్య శాస్త్రంలో అప్పారావు సిద్ధాంతి ఘనకీర్తి గడించారని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి గుర్రాల శ్రీనివాస్ కొనియాడారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం బయ్యపు అప్పారావు సిద్ధాంతిని ఘనంగా సత్కరించి, జ్యోతిష్య రత్న బిరుదు ప్రదానం చేశారు. సన్మాన పత్రం, బంగారు గండపెండేరం బహూకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరి క్షేమం కోరుతూ బయ్యపు అప్పారావు అనేక రకాల యజ్ఞ యాగాదులు నిర్వహించారన్నారు. ఆయన కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడించేలా సన్మాన పత్రం, గండపెండేరం బహూకరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, కాపు సంక్షేమ సేన రాష్ట్ర మహిళాధ్యక్షురాలు కరణం కళావతి, విజయనగరం జిల్లా తెలగ సంఘం నాయకుడు పి.వి.ఆర్, ఉపాధ్యక్షుడు బడా రమేష్, ప్రధాన కార్యదర్శి పాటి శివ, కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మల త్రినాథ్, కాపు సంక్షేమ సేన నార్త్ ఇన్‌చార్జి ఆల్లి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలి



కోసూరి శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేస్తున్న గూడూరు వెంకటేశ్వరరావు

సీతంపేట: దేశవ్యాప్తంగా బీసీల జనగణన వెంటనే చేపట్టాలని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కోసూరి శ్రీనివాసరావును నియమిస్తూ నియామక పత్రం అందించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనగణన చేపట్టాలని 29 బీసీ కమిషన్లు సిఫారసు చేసినా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే చాలా రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి పంపినా స్పందించకపోవడం విచారకరమని, ఈ విషయమై కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్, మహిళా అధ్యక్షురాలు కె.సత్యలక్ష్మి మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు అందరూ సమష్టిగా పోరాడాల న్నారు. రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడు తూ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేసినపుడే బీసీ లకు న్యాయం జరుగుతుందన్నారు. కోసూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం సౌత్ ఇండియా కన్వీనర్ ఆర్.కృష్ణవేణి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కోరుబిలి ఊర్వశి, మహిళా కన్వీనర్ వెంకటలక్ష్మి, జోనల్ అధ్యక్షుడు అప్పలరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు బి.పద్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన



మాట్లాడుతున్న హైదర్ ఆలీ సింకా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు సంబంధాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఐదో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నామని, వీటి ద్వారా ఇప్పటి వరకు 90 మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ఉచితంగా భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరఫున షాదీ ఖర్చులు భరించి వివాహాలు జరిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చిందని సింకా తెలిపారు. కమిటీ సభ్యులు మీర్ అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, మెహబూబ్ షరీఫ్, హమబూబ్ ఆలీఖాన్, షేక్ అహ్మద్ వల్లి, షేక్ అబ్దుల్ మునీర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి



కృతులు ఆలపిస్తున్న గాయకుడు విష్ణుభట్ల



కీర్తనలు ఆలపిస్తున్న వెంకటరమణ సీత

సీతంపేట: కార్తికేయ కళాక్షేత్రం నెలవారీ సంగీత కార్యక్రమంలో భాగంగా ద్వారకానగర్ బీవీకే కళాశాలలో నిర్వహించిన గాత్ర కచేరి ఆహుతులను అలరించింది. గాయని డి.వెంకటరమణ సీత మృదు మధురమైన గాత్రంతో పలు కీర్తనలు, కృతులు పాడారు. చారుకేశి, ఆడమోడి గలదే ముఖ్యాంశంగా రాగాలాపన, స్వరకల్పనలతో ఆకట్టుకున్నారు. ఈమెకు ఎస్.వి.ఎస్.ఎల్.ప్రసన్న వయోలిన్‌పై, ఎం.కామేష్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. అనంతరం గాయకుడు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి గాత్ర కచేరి జరిగింది. నవరాగమాలిక వర్ణంతో ప్రారంభించి వినాయక, హంసధ్వని, ఓరజూపు, కన్నడ గౌళ, సంగీత సామ్రాజ్య మోహన కృతులు ఆలపించారు. వీరికి హెచ్.రామచరణ్ వయోలిన్‌పై, జి.వెంకటరావు మృదంగంపై వాద్య సహకారం అందజేశారు. కళాకారులను ముఖ్య అతిథి టి.సూర్యకాంతం సత్కరించారు. కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకురాలు నిష్టల కృష్ణవేణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆరోగ్య ప్రదాయిని ఆర్‌సీడీ ఆస్పత్రి

- ప్రత్యేక అవసరాల పిల్లలకు చికిత్స
- అందుబాటులో ఫిజియో, స్పీచ్ థెరపీలు



వంకపాదాలు కలిగిన చిన్నారిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న సిబ్బంది



రాణి చంద్రమణి దేవి ప్రభుత్వ ఆస్పత్రి

ఏయూ క్యాంపస్: ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఆరోగ్య ప్రదాయినిగా పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి(ఆర్‌సీడీ) ప్రభుత్వ ఆస్పత్రి నిలుస్తోంది. చిన్నారులకు అందించే చికిత్సలు వారిని సాధారణ స్థితికి తీసుకురావడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి చికిత్స నిమిత్తం వందలాది మంది చిన్నారులు ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ నాణ్యమైన వైద్యం పొంది ఆరోగ్యంగా వెళ్తున్నారు. పొరుగు రాష్ట్రాల ప్రజలు సైతం ఈ ఆస్పత్రిలో చికిత్స పొందడం గమనార్హం.

వంకర కాళ్లకు చికిత్స:

ఆర్‌సీడీ ఆస్పత్రికి వచ్చే చిన్నారుల్లో అధిక శాతం మంది జన్మతా సంక్రమించే వంకర కాళ్ల సమస్యతో వచ్చిన వారే. వారిని పరిశీలించి ప్రత్యేకంగా పీవోపీ కట్టు వేసి వంకరకాళ్లను సరిచేసేలా వైద్యులు కృషి చేస్తున్నారు. కొంత మందికి దీంతో పాటు స్వల్ప శస్త్రచికిత్స కూడా అవసరం అవుతుంది. అలా శస్త్ర చికిత్స కూడా చేసి, పూర్తి ఆరోగ్యంతో వెళ్లేలా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నారు. ఇక్కడ నెలకు 40 నుంచి 60 వరకు శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

స్పీచ్ థెరపీ.. ఫిజియోథెరపీ

కొంత మంది పిల్లల్లో జన్మతా కొన్ని శారీరక సమస్యలు వస్తుంటాయి. ఇటువంటి వారికి అవసరమైన స్థాయిలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. ఇక్కడ సుశిక్షితులైన సిబ్బంది నిత్యం శారీరక వైకల్యం కలిగిన చిన్నారులకు అవసరమైన ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఓర్పుతో చేస్తున్నారు. అలాగే కొంత మంది చిన్నారుల్లో మాటలు రావడం ఆలస్యం అవుతుంది. అటువంటి వారికి అవసరమైన స్పీచ్ థెరపీ సేవలు సైతం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. మస్తిష్క పక్షవాతం(సెరిబ్రల్ పాల్సీ) సమస్య కలిగిన చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వీరి కోసం సుశిక్షితులైన సిబ్బంది ప్రత్యేకంగా తర్ఫీదును ఇస్తూ చిన్నారులు తమ దినచర్యలు సక్రమంగా చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

కొత్త పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి

ఆస్పత్రి అవసరాలకు అనుగుణంగా పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. తాజాగా రూ.5 లక్షలతో నూతన పరికరాలను కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. రోగుల సౌకర్యార్థం కొత్తగా లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. ఆరోగ్యశ్రీ ఉపయోగించుకుని ఇక్కడ సేవలు పొందే అవకాశం కూడా ఉందని డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాశ్, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, భానుప్రకాశ్, నాంచారయ్య, నాగ గణేష్, రంగారావు, త్రినాథ్, భాస్కరాచారి, దుర్గాప్రసాద్, పుష్పమి, అన్వేషు, శివ, మల్లిక, సీత ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో కుక్క కరిచింది, కవితల పోటీ, జస్ట్ ఫర్ చేంజ్, హిందీ నేర్చుకునేందుకు, షాపింగ్, కుక్క తినేసింది, డిగ్రీ పోయింది, టీవీ యాంకర్, వదిన స్కిట్లు ఆహుతులను నవ్వుల్లో ముంచెత్తాయి. కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి, బాందంగీర్ సాయి తదితరుల చేతుల మీదుగా కేక్ కట్‌చేసి ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.